క్లుప్తంగా

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి


ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్

ఆళ్లగడ్డ: స్థానిక పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు కొత్తగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ రవికుమార్ తెలిపారు. ఆళ్లగడ్డ డీఎస్పీగా నియమితులైన ఆయన బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే ఉండదన్నారు. ప్రజల భద్రత కోసం నిరంతరం కృషి చేస్తామన్నారు. రాత్రి వేళల్లో గస్తీ పెంచుతామని, దొంగలు, నేరగాళ్లు, పాత నేరస్తులు, రౌడీషీటర్లపై నిఘా వేసి నేరాల కట్టడికి కృషి చేస్తానని వెల్లడించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


ఆలమూరు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

రుద్రవరం: మండల పరిధిలోని ఆలమూరు పీహెచ్‌సీ వైద్యాధికారి అమర్నాథరెడ్డి బుధవారం అదే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పిల్లల ఎత్తు, బరువు, హెచ్‌బీ వంటివి పరీక్షించారు. చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. అలాగే గ్రామ సచివాలయంలో గర్భిణులు, బాలింతలకు సమావేశం నిర్వహించి పౌష్టికాహారం, వ్యాధి నిరోధక టీకాల ఆవశ్యకతను వివరించారు.

పండ్ల తోటల సాగు లాభదాయకం


ముస్లిం శ్మశాన వాటికలో నాటిన మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఉయ్యాలవాడ: సన్న, చిన్నకారు రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పండ్ల తోటలను సాగు చేస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. మండల కేంద్రంలోని ముస్లిం శ్మశాన వాటికలో ఉపాధి కూలీలతో నాటించిన కొబ్బరి మొక్కలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో వివిధ గ్రామాల్లో 99 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడంతో ఇప్పటికి 62 ఎకరాల్లో 3,600 కొబ్బరి మొక్కలు నాటే పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఏపీఓ రవిప్రకాష్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ

దొర్నిపాడు: మండల నూతన ఎస్‌ఐగా వెంకటేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న సురేష్ నంద్యాల రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఈయన అన్నమయ్య జిల్లా పోలీస్ కంట్రోల్ రూం (పీసీఆర్)లో విధులు నిర్వహిస్తు బదిలీపై ఇక్కడికి వచ్చారు. అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

విద్యార్థులకు అభినందనలు


విజేతలతో మంత్రి ఫరూక్, దస్తగిరిరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): గురురాజ విద్యార్థులు జాతీయ దేశభక్తి భావాలను చాటారని మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ అభినందించారు. బుధవారం పట్టణంలోని శ్రీ గురురాజ పాఠశాలలో మాతృభూమికి కళార్చన విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. చైర్మన్ డాక్టర్ పి.దస్తగిరిరెడ్డి, డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ రవికృష్ణ పాల్గొని విజేతలైన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. 350 మంది విద్యార్థులు ప్రదర్శించిన సైరా నరసింహారెడ్డి కళారూప ప్రదర్శన ఆకట్టుకుందన్నారు. మౌలాలి రెడ్డి, షేక్షావలి రెడ్డి పాల్గొన్నారు.

శ్రీశైలంలో భారీ వర్షం

నంద్యాల(అర్బన్): మంగళవారం రాత్రి 1గంట నుంచి బుధవారం ఉదయం వరకు శ్రీశైలంలో ఎడతెరపి లేని భారీ వర్షం కురిసింది. ఒక్క శ్రీశైలంలోనే దాదాపు 130.8 మి.మీ వర్షపాతం నమోదు కాగా, ప్యాపిలి మండలంలో 36.0 మి.మీ, డోన్‌లో 0.4 మి.మీ వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా 17 సెం.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు బుధవారం తెలిపారు.

ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

బొమ్మలసత్రం: ఇన్వెస్ట్ స్కీమ్‌ల పేరుతో సామాజిక మాధ్యమాల్లో వచ్చే వాటిని నమ్మి పెట్టుబడులు పెట్టి సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల సామాజిక మాధ్యమాలలో వారి సొంత వెబ్‌సైట్‌ను ఉంచి అమాయకులను నమ్మించి మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి ఉంటే 1930 నంబర్‌కు లేదా జిల్లా సైబర్ క్రైమ్ నంబర్ 9154987034 కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

పశువుల లెక్క.. ఇక పక్కా!

- సెప్టెంబర్ 1 నుంచి జాతీయ పశుగణన
- పశువుల గణనకు 320 మంది ఎన్యూమరేటర్ల నియామకం
- నాలుగు నెలలపాటు నిర్వహణ
- జిల్లాలోని 4.29 లక్షల నివాసాల్లో గణనకు ఏర్పాట్లు


పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు (ఫైల్)

నంద్యాల(సెంట్రల్): పశువుల లెక్కను తేల్చేందుకు ప్రభుత్వం వచ్చే నెల నుంచి పశుగణనను చేపట్టనుంది. ఐదేళ్లకొకసారి జరిగే ఈ ప్రక్రియ వచ్చే నెల ఒకటి నుంచి మొదలుకానుంది. జిల్లాలో 21వ జాతీయ పశుగణనను ప్రారంభించేందుకు పశుసంవర్ధక శాఖ ఇప్పటికే ఏర్పాట్లు చేపట్టింది. పశుగణనను చేపట్టేందుకు ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు నాలుగు నెలలు పాటు నిర్వహించే పశుగణనలో మూగజీవుల లెక్క తేలనుంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 320 మంది ఎన్యూమరేటర్లను నియమించారు. వీరంతా పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు నాయక్ పర్యవేక్షణలో పశుగణన చేపట్టనున్నారు.

ఐదేళ్లకోకసారి..

దేశంలో తొలిసారిగా జాతీయ పశుగణనను 1919–20లో చేపట్టారు. అప్పటి నుంచి ప్రతి ఐదేళ్లకోసారి గణన చేపడుతున్నారు. పశువుల జీవిత కాలం తక్కువగా ఉంటుంది. అదే సమయంలో పునరుత్పత్తి అధికంగా ఉంటుంది. అందువల్ల ప్రతి ఐదేళ్లకు ఒక్కసారి జాతీయ పశుగణన కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపడుతుంది. ప్రస్తుతం 21వ జాతీయ పశుగణన ప్రారంభం కానుంది.

ఇలా లెక్కగడతారు..

పశుగణనలో భాగంగా ప్రతి నివాసాన్ని ఎన్యూమెరేటర్ సందర్శిస్తారు. గేదెలు, ఆవులు, కోళ్ల వాటి జాతి రకాలు, గొర్రెలు, మేకలు, పందులు, కుక్కలు తదితర పశు జాతులను నమోదు చేస్తారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక ఎన్యూమరేటర్‌ను నియమించారు. ఇలా జిల్లాలో రెవెన్యూ గ్రామాలు, వార్డులకు 320 మంది ఎన్యూమరేటర్లును కేటాయించారు. గతంలో ట్యాబ్స్ ద్వారా ఆన్‌లైన్‌లోనే గణన చేపట్టగా ఇసారి ఎన్యూమరేటర్ ఫోన్‌లోనే యాప్ ద్వారా నమోదు చేయనున్నారు. జిల్లాలలో 4.21 లక్షల నివాసాలను గణన చేయాల్సి ఉంది. ఆవుల్లో రకాలు, కోళ్లల్లో టర్కీ, నాటు, కంజూ, పిట్టలు, ఫారం కోళ్ల రకాలు ఉంటాయి. మేకలు గొర్రెలు, పొట్టేళ్లు, పందులు, కుక్కలు, తెల్లటి కోళ్లు, బాతులు, సేద్యపు ఎద్దులు ఇలా వేర్వేరుగా నమోదు చేయాలి. పశుసంపదతో పాటు ఆ గ్రామంలో పశు వైద్యశాల ఉందా.. లేదా, పాల సేకరణ కేంద్రం, పశుగ్రాస క్షేత్రాలు ఉన్నాయా లేవా.. పశుగ్రాసాన్ని కొనుగోలు చేస్తున్నారా.. సొంతంగా చేపడుతున్నారా, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా వంటి తదితర విషయాలను నమోదు చేస్తారు. పశు యజమాని అక్షరాస్యత, పశుసంపద ద్వారా ఎంత ఆదాయం వస్తుంది. పశువుల షెడ్డు ఉందా.. ఆరుబయట పశువులను కడుతున్నారా.. గొర్రెల సొసైటీలు ఉన్నాయా, పశువధశాల ఉందా.. పశువుల సంరక్షణలో పురుషులు, స్త్రీలు ఎవరు ఎక్కువగా సంరక్షణ చేస్తున్నారనే విషయాలను కూడా సేకరించనున్నారు.

సమాచారం ఇవ్వకపోతే నష్టం..

పశుగణన ఆధారంగానే జిల్లాకు ప్రభుత్వం నుంచి బడ్జెట్ కేటాయింపులుంటాయి. పశువుల సంఖ్యను బట్టి వ్యాధి నిరోధక టీకాలు, నట్టల వ్యాధి నివారణ మందులు సరఫరా చేస్తారు. ఇదంతా సక్రమంగా జరగాలంటే రైతులు సరైన సమాచారాన్ని ఎన్యూమరేటర్లకు అందజేయాలి. అయితే చాలా మంది రైతులు పశుసంపద సమాచారాన్ని పూర్తి స్థాయిలో ఇచ్చేందుకు నిరాకరిస్తుంటారు. పూర్తి సమచారం ఇస్తే ఆదాయపు పన్ను పరిధిలోకి వస్తామన్న అపోహలతో సమాచారం ఇవ్వరు. దీనివల్ల పరోక్షంగా రైతులకే నష్టం చేకురుతుందని పశువైద్యులు పేర్కొంటున్నారు.

వచ్చే నెల నుంచి పశుగణన



వచ్చే నెల 1వ తేదీ నుంచి నంద్యాల జిల్లాలో జాతీయ పశుగణన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా పశువుల వివరాలను సేకరించుటకు జిల్లా వ్యాప్తంగా 320 మంది ఎన్యూమరేటర్లను నియమించి, శిక్షణ కూడా ఇచ్చాం. త్వరలో జాతీయ పశుగణనకు సంబంధించి పోస్టర్లను విడుదల చేస్తాం. పశుగణన కార్యక్రమానికి పాడి రైతులు సహకరించాలి. పశుగణన ఆధారంగా జిల్లాకు బడ్జెట్ వస్తుంది.

– గోవింద్ నాయక్, జిల్లా పశువర్థక శాఖ అధికారి, నంద్యాల

పశుగణనతో ఎంతో ప్రయోజనం



జాతీయ పశుగణన కార్యక్రమం ద్వారా పాడి రైతులు పడే ఇబ్బందులు ప్రభుత్వం దృష్టికి వెళ్తాయి. పాడి రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పశు సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతున్నాయో లేదో తెలుస్తుంది. ప్రతి ఐదేళ్లకు ఒక్కసారి చేపట్టే ఈ కార్యక్రమం ద్వారా పాడి రైతులకు ఎంతో ప్రయోజనం.

–సుధాకర్‌రెడ్డి పాడిరైతు, బానకచర్ల, పాములపాడు మండలం

పాడిరైతుల్లో అవగాహన పెంచాలి



పశుగణపై పాడి రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలి. అధికారులకు పూర్తి సమాచారం ఇవ్వడం ద్వారా నష్టం చేకూరదనే అంశంపై వారికి భరోసానివ్వాలి. పశు సంరక్షణకు ప్రతి గ్రామంలో వైద్యాధికారులను ఏర్పాటు చేయాలి. దూరంలో ఉన్న వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవడం ఈ కార్యక్రమంలో బయటపడుతుంది.

– వెంకటరామిరెడ్డి, హుసేనాపురం, ప్యాపిలి మండలం

23న గ్రామ సభలు

ఉయ్యాలవాడ: ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టేందుకు ప్రతి గ్రామపంచాయతీలో ఈ నెల 23వ తేదీన గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా గ్రామ సభలు స్థానిక గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో సర్పంచ్, వార్డు మెంబర్లు, రైతులు, గ్రామ ప్రజలతో కలిసి నిర్వహించాలన్నారు. ముందస్తుగా గ్రామంలో దండోరా, టాంటాం వేయించి అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా చూడాలన్నారు.

సభలకు అధికారుల నియామకం

శిరివెళ్ల: ఈ నెల 23వ తేదీన ఉపాధి పథకం పనులపై నిర్వహించనున్న గ్రామ సభలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఏంపీడీఓ సుబ్రమణ్యం బుధవారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీ సర్పంచ్ అధ్యక్షతన సభ జరుగుతుందన్నారు. శిరివెళ్ల గ్రామ పంచాయతీకి ఈఓఆర్డీ నాగేంద్ర, యర్రగుంట్లకు తాను, గుంప్రమాన్‌దిన్నెకు డిప్యూటీ తహసీల్దార్ నర్సిరెడ్డి, జీనే పల్లెకు ఏంపీడీఓ కార్యాలయ ఏఓ నారాయణమూర్తిని నియమించామన్నారు. అలాగే మోత్కల పల్లెకు ఎంఈఓ–1 శంకరప్రసాద్, గంగవరానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిదాబేగం, గుండంపాడుకు హౌసింగ్ ఏఈ నాగశేఖర్, బోయలకుంట్లకు ఏఓ సుధాకర్, చెన్నూరు ఈసీ సుబ్బరాయుడు, మహదేవపురానికి ఎన్‌ఆర్‌జీఎస్ ఏఓ రామసుబ్బయ్య, కామినేనిపల్లెకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిరణ్‌బాబు, గోవిందపల్లెకు పీఆర్ ఏఈ రవికుమార్ నియమితులయ్యారు. కోటపాడుకు ఏంఈఓ–2 నాగార్జునరెడ్డి, వీరారెడ్డిపల్లెకు ఆర్‌ఐ సుచరిత, వెంకటాపురానికి పీఏఎస్ దస్తగిరి, వనికినిదిన్నె గ్రామ పంచాయతీకి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలతను నియమించామన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనుల ప్రతిపాదనలపై సభ ఆమోదం తీసుకోవడం జరుగుతుందన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

నంద్యాల(అర్బన్): గ్రామాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ సుగుణశ్రీ కోరారు. స్థానిక కార్యాలయ భవనంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులతో ఈనెల 23వ తేదీన మండలంలోని గ్రామాల్లో నిర్వహించే సదస్సులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం, అంతర్గత రోడ్లు, తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సదస్సులో వచ్చే సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని చెప్పారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రామాంజనేయులు పాల్గొన్నారు.

సభలను సక్రమంగా నిర్వహించాలి

గోస్పాడు: ఉపాధి హామీ పనులను ఆమోదించేందుకు ఈనెల 23వ తేదీన గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామ సభలను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ నాగఅనసూయ తెలిపారు. గ్రామ సభలకు సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు. వచ్చే మూడు నెలల వరకు గ్రామీణ కూలీలకు పనులు కల్పించేందుకు ఉపాధి పనుల ఎంపిక చేయుట, గ్రామీణ పారిశుద్ధ్యంలో భాగంగా గ్రామాల్లో మురుగునీటి కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన పనులను గుర్తించాలని చెప్పారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డుకు అవసరమైన అప్రోచ్ రోడ్లు, మరమ్మతులు పూర్తి చేసే పనులను గుర్తిస్తామన్నారు.

విద్యార్థినులకు కంటి పరీక్షలు


చాగలమర్రి కేజీబీవీలో విద్యార్థినులకు కంటి పరీక్షలు చేస్తున్న టెక్నీషియన్ రమేష్

చాగలమర్రి: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో చాగలమర్రిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ప్రిన్సిపాల్ సునీత ఆధ్వర్యంలో బుధవారం దృష్టి లోపం ఉన్న విద్యార్థినులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 264 మంది విద్యార్థినులకు ఆప్తాల్మిక్ అసిస్టెంట్ రమేష్ కంటి పరీక్షలు చేశారు. వారిలో 21 మంది విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. వీరికి నంద్యాల జిల్లా అంధత్వ నివారణ సంస్థ తరపున ప్రభుత్వం కళ్లద్దాలను ఉచితంగా అందిస్తుందని రమేష్ తెలిపారు. అలాగే 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థినులకు ధనుర్వాతం, డిఫ్తీరియా వ్యాధులు సోకకుండా టీడీ వ్యాక్సిన్ వేశారు. హెల్త్ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ సమత, హెల్త్ అసిస్టెంట్ లీలావతి, ఆశ కార్యకర్తలు పెద్దక్క, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దకే వైద్యసేవలు

ఉయ్యాలవాడ: గ్రామాల్లో నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి వెంకటసుబ్బయ్య ప్రజలకు సూచించారు. మండల పరిధిలోని ఎస్.కొత్తపల్లె గ్రామంలో బుధవారం ఉయ్యాలవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి, ఆరోగ్య సిబ్బంది 104 వాహనంలో ఆ గ్రామానికి తరలివెళ్లి ప్రజలకు వైద్య సేవలు అందించారు. సీజనల్ వ్యాధులతో పాటు దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి రక్తహీనత ఉన్న చిన్నారులను గుర్తించి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఆకుకూరలు, బెల్లంతో తయారు చేయబడిన ఆహార పదార్థాలు విద్యార్థులకు అందించాలని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

117 జీఓ రద్దు చేయాలి


మాట్లాడుతున్న గోపాలకృష్ణ

నంద్యాల(న్యూటౌన్): కూటమి ప్రభుత్వం 117వ జీఓను వెంటనే రద్దు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘ నాయకులతో చర్చలు జరిపి జీఓ నంబర్ 53 ప్రకారం సర్దుబాటు చేస్తామని చెప్పి మళ్లీ 117వ జీఓ ప్రకారమే సర్దుబాటు ప్రక్రియ చేపట్టడం తగదన్నారు. దీంతో పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులకు సరెండర్ లీవ్, ఏపీజీఎల్‌ఐ రుణాలు, పీఎఫ్ రుణాలు జాడే లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మౌలాలి,ఆజామ్‌బేగ్, ప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పసిడి పేరుతో టోకరా

- నంద్యాలవాసికి కర్ణాటకలో రూ.24 లక్షలు టోపీ
- ముఠాను అరెస్టు చేసి రికవరీ చేసిన పోలీసులు

గౌరిబిదనూరు: నకిలీ బంగారం చూపి ఓ వ్యక్తి నుంచి రూ.24 లక్షలు మోసం చేసిన ఘటన కర్ణాటక రాష్ట్రం తుముకూరులో చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా గోస్పాడు మండలంలోని యాల్లూరుకు చెందిన మహమ్మద్ హుసేన్, షబ్బీర్ సులభంగా డబ్బు సంపాదించాలని పథకం వేశారు. ఇందుకు కర్ణాటకలోని తుమకూరు జిల్లాకు చెందిన ఐదుగురిని కలుపుకున్నారు. గౌరిబిదనూరులో హక్కిపిక్కి కాలనీలో 2 నుంచి 3 కేజీల బంగారం ఉందని, కేజీ రూ.24 లక్షలు మాత్రమే చెబుతున్నారని, వచ్చి పరీక్షించి, నిజమని తేలితేనే కొనుక్కోండి అని నంద్యాలకు చెందిన అల్లూరయ్యకు ఫోన్ చేసి చెప్పారు. దీంతో అల్లూరయ్య.. సురేంద్ర, బ్రహ్మం, నరసింహయ్యతో కలిసి కారులో రూ.24 లక్షల నగదు తీసుకుని వెళ్లారు. గౌరిబిదనూరు శివారులో వారిని హుసేన్, షబ్బీర్ ముఠా కలిసి నకిలీ బంగారు గుండ్లు ఉన్న హారాలను ఇచ్చి రూ.24 లక్షలు తీసుకెళ్లారు. అల్లూరయ్య బృందం ఆ హారాలను పరీక్షించి చూడగా నకిలీ బంగారమని తెలిసి నిందితుల కోసం పలుచోట్ల గాలించినా దొరకలేదు. దీంతో రూరల్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు ఏడుగురిని అరెస్టు చేసి రూ. 23 లక్షలు రికవరీ చేశారు.

ఫేజ్–2 అడ్మిషన్లు ప్రారంభం

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫేజ్–2 అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి బుధవారం తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఇది మంచి అవకాశమన్నారు. ఆసక్తి కలిగిన వారు ఇంటర్ ఉత్తీర్ణత జిరాక్స్ కాపీలతో ఈ నెల 24వ తేదీలోగా కార్యాలయంలో పేర్లను రిజిష్టర్ చేసుకోవచ్చన్నారు.

ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలి

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టి రాయలసీమ జిల్లాల రైతులను కాపాడాలని, మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టం ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, నంద్యాల జిల్లా సీపీఐ ప్రధాన కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

అనధికార లే అవుట్లలో ప్లాట్లు కొనొద్దు

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని ప్లాట్లు, ఇళ్ల స్థలాలు కొనే ముందు తప్పనిసరిగా అధికారికంగా గుర్తించిన లే అవుట్లలో కొనుగోలు చేయాలని, అనధికార లే అవుట్లలో ప్లాట్లు కొని చిక్కుల్లో పడొద్దని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాల మున్సిపల్ పరిధిలో సుమారు 79 అక్రమ లే అవుట్లలో 305.5 ఎకరాలను గుర్తించామన్నారు. ఈ అక్రమ లే అవుట్లలో కొన్న ప్లాట్లకు ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయబడవన్నారు. అంతే కాకుండా అక్రమ లే అవుట్లలో రోడ్లు, కరెంటు, నీరు, డ్రైన్లు లాంటి మౌలిక సదుపాయాలు కల్పించలేమని పేర్కొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని, జీఓ ప్రకారం రూ.16 వేలు వేతనం ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, బాలవెంకట్ మాట్లాడారు.

భక్తి శ్రద్ధలతో మధ్యారాధన వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో బైటిపేటలో వెలిసిన శ్రీ ఆంజనేయ కోదండరామ స్వామి దేవస్థానంలో బుధవారం శ్రీ రాఘవేంద్ర స్వామి మధ్యారాధన వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారి బృందావనానికి పంచామృత అభిషేకం నిర్వహించి పుష్పాలంకరణ, అర్చన, నైవేద్యం, మహా మంగళహారతి చేపట్టారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

నంద్యాల(న్యూటౌన్): ఏపీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఏపీఎం ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో నూతన కార్యవర్గం సమావేశం నిర్వహించారు. అనంతరం ఏపీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా గోవింద్, సెక్రెటరీగా ముకేష్, ట్రెజరర్‌గా వెంకటరమణను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మునిరత్నం, మార్కొండేయులు, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, శ్రీనివాసరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార నిర్వహణపై అవగాహన

నంద్యాల(న్యూటౌన్): ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు తమ వ్యాపార నిర్వహణ, శక్తి సామర్థ్యాలపై బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనున్న స్కిల్‌హబ్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో 8 రోజుల పాటు బిజినెస్‌పై ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్‌నేషనల్ లేబర్ అర్గనైజేషన్‌తో సంయుక్తంగా నిర్వహిస్తున్నామన్నారు. డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజారాణి, మస్తాన్, సుబ్బయ్య పాల్గొన్నారు.

పత్తిలో గులాబీ రంగు పురుగును నివారించాలి

దొర్నిపాడు: పత్తి పంటలో గులాబీ రంగు పురుగు పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని డీఆర్‌సీ ఏడీఏ సరళమ్మ, నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్త శివరామకృష్ణ సూచించారు. మండలంలోని రామచంద్రాపురంలో సాగుచేసిన పత్తి పంటను బుధవారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పి.బి నాట్ అనే జపాన్ వారి కొత్త ఆవిష్కరణ ద్వారా సంపర్క ప్రక్రియకు అంతరాయం కల్గించడం వల్ల పత్తిలో గులాబీ రంగు పురుగును అరికట్టవచ్చన్నారు. కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్, ఏఓ సునీత, వీఏఏ సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

పశు ఉత్పత్తిలో ఘనీకృత వీర్య కేంద్రం కీలక పాత్ర


ఆంబోతుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

నంద్యాల(అర్బన్): పశుజాతి అంతరించిపోతున్న ఈ రోజుల్లో నాణ్యమైన ఘనీకృత వీర్యాన్ని తయారు చేసి పశువులను ఉత్పత్తి చేయడంలో నంద్యాల ఘనీకృత వీర్యకేంద్రం కీలకం పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం నంద్యాల పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఘనీకృత పశువీర్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఈ సంస్థలో 10 జాతుల పశువులను వీర్యాన్ని సేకరించి భద్రపరిచి అవసరమైన జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారన్నారు. సెమన్ బ్యాంకు, బుక్ మేనేజ్‌మెంట్, లేబోరేటరీ, డిస్ట్రిబ్యూషన్ సెక్షన్లను సందర్శించి అభినందించారు. ఇక్కడి ఆబోతులను బయో సెక్యూర్ జోన్‌లో ఉంచి వ్యాధులు సోకకుండా క్రమం తప్పకుండా టీకాలు వేయిస్తున్నామని పశుసంవర్ధక అధికారి గోవింద నాయక్ కలెక్టర్‌కు వివరించారు. 16.94 ఎకరాల విస్తీర్ణంలో ఆంధ్రప్రదేశ్ పశుగణనాభివృద్ధి సంస్థ, ఘనీకృత వీర్యకేంద్రం ఉందన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద జరుగుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలపై స్పెషల్ డ్రైవ్


వాహనాలను తనిఖీ చేస్తున్న నంద్యాల టూటౌన్ సీఐ

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలపై స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్పీ సూచనల మేరకు అన్ని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా బృందాలుగా ఏర్పాడిన పోలీసులు ముఖ్యమైన కూడళ్లు, బ్లాక్‌స్పాట్‌ల వద్ద సివిల్, ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీతో పాటు నిబంధనలకు అనుగునంగా నడుచుకోని 114 వాహనాలను సీజ్ చేశారు. నంబర్‌ప్లేట్ లేకుండా తిరిగే వాహనాలు, మైనర్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్, రికార్డులు సరిగా లేని వాహనాలు, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసిన వాహనాలను సీజ్ చేశామని పోలీసులు చెప్పారు.

ఫర్టిలైజర్ దుకాణం తనిఖీ

రుద్రవరం: చిన్నకంబలూరు శ్రీలక్ష్మీనరసింహ్మా స్వామి ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్ దుకాణాన్ని బుధవారం మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ, ఏఈఓ రాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా చిన్నకంబలూరులోని దుకాణంలో తనిఖీ చేయగా రూ.1,20,930 విలువ చేసే పురుగు మందులకు అనుమతి పత్రాలు లేకపోవడంతో వాటి విక్రయాలను నిలిపివేశామన్నారు. రసాయన ఎరువులు అధిక ధరలకు విక్రయించినా, కృత్రిమ కొరత సృష్టించినా సదరు వ్యాపారుల లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. యూరియా కావాల్సిన రైతులు స్థానిక రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.


ఎర్రగుడిదిన్నె అడ్డరోడ్డు వద్ద నీట మునిగిన వరి పొలాలు

చెరువు కాదు పొలం

రుద్రవరం: మండలంలో రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి నీట మునిగిన పొలాలు ఇంకా తేరుకోలేదు. సోమవారం సాయంత్రం, మంగళవారం తెల్లవారుజామున కుండపోతగా దాదాపు 66 మి.మీ. వర్షం కురిసింది. దీంతో బుధవారం సైతం వాగులు వంకలు ఉధృతంగా ప్రవహించాయి. మండల కేంద్రమైన రుద్రవరం, రెడ్డిపల్లె, ఆర్.కొత్తూరు, ఎర్రగుడిదిన్నె అడ్డ రోడ్డు తదితర గ్రామాల పరిధిలోని పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచి పైర్లన్నీ నీటమునిగాయి. ఎర్రగుడిదిన్నె అడ్డ రోడ్డు వద్ద వారం క్రితం నాటిన వరిని వరద ముంచెత్తి మాగానిలో గట్లను తెంచుకొని పారుతూనే ఉంది. దీంతో ఆ పొలంలో నారు మొత్తం కొట్టుకుపోవడంతో ఆరంభంలోనే పెట్టుబడులు వర్షార్పణం అయ్యాయని రైతులు లబోదిబోమంటున్నారు.

విజయవంతం చేయండి

నంద్యాల(అర్బన్): ఏపీ దళిత సమాఖ్య 22వ ఆవిర్భావ వార్షికోత్సవ సభను ఈనెల 25వ తేదీన అనంతపురంలోని లలితా కళాపరిషత్ నిర్వహించనున్నామని తరలివచ్చి విజయవంతం చేయాలని సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కృష్ణ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట పోస్టర్లను విడుదల చేశారు.